క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

భీమారం: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తి దారుల సంఘం 2025క్యాలెండర్లను ఆదివారం హైదరాబాద్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బేరి రాంచందర్ రావు, సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సొధాని భూమన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భజన చేస్తున్న భక్తులు

భీమిని: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని భజన మండలి సంఘం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి వెంకటేష్‌చారి అన్నారు. కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయ సన్నిధిలో ఆదివారం మహా భజన కార్యక్రమం చేపట్టారు. పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం కళాకారులను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యాక్రమంలో గౌరవ అధ్యక్షుడు తాడూరి దత్తాత్రేయచారి, ప్రధాన కార్యదర్శి ఎర్రోజు రమేష్‌చారి, ఆయా మండలాల కళాకారులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

జన్నారం: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఇషికా ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పంచెర్పుల రఘువర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందన్నారు. హైదరాబాద్, బెంగుళూరుకు చెందిన పలువురు కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతారని, నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు ఊరటను కలిగించడంపై బీజేపీ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.12లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపును కల్పించడాన్ని మధ్యతరగతి ప్రజలు స్వాగతిస్తున్నారని, ఉద్యోగులకు ఇది పెద్ద ఊరటగా బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీశ్‌రావు, తోట మల్లిఖార్జున్, రెడ్డిమల్ల అశోక్, రాజేశ్ రెన్వా, చిరంజీవి, మేన సూరి, అర్నకొండ శ్రీనివాస్, దేవరకొండ వెంకన్న, ఆరెందుల శ్రీనివాస్, తరుణ్‌సింగ్, శివ పాల్గొన్నారు.

వెంచర్‌కు హైకోర్టులో స్టేటస్ కో



W.A.NO.83 of 2025

Admit.

Learned counsel for respondent Nos.1 and 3 to 5 pray for fifteen days' time to file counter.

List this matter with W.P.No.33657 of 2023 on 11.02.2025.

I.A.No.3 of 2025

Learned counsel for the petitioner submits

హైకోర్టు నుంచి జారీ అయిన స్టేటస్ కో

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట గ్రామ పంచాయతీ శివారులోని మేడారం వద్ద గల ఓ వెంచర్‌కు ఇటీవల హైకోర్టు స్టేటస్ కో జారీ చేసిందని కొండపర్తి లక్ష్మి అనే మహిళ తెలిపారు. అందుగులపేట గ్రామ పంచాయతీ శివారులోని 257సర్వే నంబర్‌లో తనకు వారసత్వంగా వచ్చిన భూమిలో కొందరు అక్రమంగా వెంచర్ చేశారని సదరు మహిళ ఆరోపించారు. ఆ నంబర్‌లోని వెంచర్‌లో గల 6.29ఎకరాల (38ఈ, పట్టా) భూమి తనకు వారసత్వంగా వచ్చిందని, తనకు తెలియకుండా ఆ భూమిలో అక్రమంగా వెంచర్ చేశారని హైకోర్టుకు వెళ్లగా ఇటీవల స్టేటస్ కో జారీ చేసిందని మహిళ వివరించింది.

'వెలుగు'కొంటేనే వ్యాపారం..!



నస్పూర్: పట్టణ పరిధిలోని వారానికి రెండురోజుల పాటు జరిగే వారసంతలో వీధిలైట్లు లేక అద్దె లైట్ల వెలుతురులో చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. రాయల్‌గార్డెన్ సమీపంలో ఓ ప్రైవేటు స్థలంలో ప్రతీ మంగళ, శనివారాలు వారసంత నిర్వహిస్తారు. ఆ స్థలంలో ఎలాంటి వీధిలైట్లు లేకపోవడంతో చిరువ్యాపారులు బ్యాటరీ లైట్లను అద్దెకు తీసుకొచ్చుకొని చాలీచాలని వెలుతురులో తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రోజుకు ఒక్కో లైట్‌కి రూ.40అద్దె చెల్లించాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సంత జరిగే స్థలంలో వీధిలైట్లు ఏర్పాటు చేయడమో లేదా ఇంటిగ్రేటెడ్ భవనాన్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

వెలగని వీధిదీపాలు



దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఎస్సీ కాలనీ చీకటిపడితే చాలు అంధకారంలో మగ్గుతోంది. విద్యుత్‌లైన్ సమస్య కారణంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకటిపడితే బయటికి వెళ్లేందుకు జనాలు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెల రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలోనూ సమస్య పరిష్కారం కోసం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కల్యాణ్‌ను సంప్రదించగా విద్యుత్ లైన్ సమస్యతో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలో పరిష్కరిస్తామని చెప్పారని పేర్కొన్నారు.

ఘన చరిత్ర.. శిథిలావస్థ



దండేపల్లి: ఎంతోమంది ప్రముఖులకు బస కల్పించిన అతిథి గృహం(విశ్రాంతి భవనం) నేడు వెలవెలబోతోంది. దండేపల్లి మండలం లింగాపూర్‌లో ఏళ్ల క్రితం రోడ్లు భవనాలశాఖ అతిథి గృహం నిర్మించారు. అప్పట్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇక్కడ బసచేశారు. లక్సెట్టిపేట-నిర్మల్ రహదారికి సమీపంగా లింగాపూర్‌లో దీనిని నిర్మించారు. గెస్ట్‌హౌస్‌కు సంబంధించి సుమారు రెండు, మూడెకరాల స్థలం కూడా ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన గెస్ట్‌హౌస్ పాలకుల ఆదరణ కోల్పోయి, పూర్తిగా శిథిలమవుతుంది. దీని ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. పంచాయతీ నర్సరీని కూడా ఇదే ఆవరణలో ఏర్పాటు చేశారు. సుమారు 1934లో దీనిని నిర్మించడంతో గతమెంతో ఘనంగా ఉండేది. ఇప్పుడేమో పూర్తిశిథిలమైంది.

పొగతో ఉక్కిరిబిక్కిరి..!



అందాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డులో పొగ

- డంపింగ్ యార్డులో తరుచూ మంటలు
- ఇబ్బంది పడుతున్న సమీప కాలనీప్రజలు
- శాశ్వతంగా డంపింగ్ యార్డు తరలించాలని డిమాండ్

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన డంపింగ్ యార్డు అందాళమ్మ కాలనీలో ఉండగా, డంపింగ్ యార్డులోని చెత్త తరుచూ కాలిపోతూ, పొగచూరి ఆ ప్రాంతంతో పాటు, సమీపంలోని కాలనీల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. చలికాలం కావడం, చెత్త కాలడం వల్ల పొగ వస్తుండడంతో పలువురు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చెత్త నుంచి వెలువడుతున్న పొగతో అనారోగ్యం బారిన పడుతున్నారు. మంచిర్యాల పట్టణానికి దూరంగానే గతంలో ఈ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయగా, పట్టణం విస్తీర్ణం పెరిగి కాలనీలకు దగ్గరగా మారింది. డంపింగ్ యార్డులోని చెత్త కుప్పల నుంచి దుర్వాసనతోనే ప్రతిరోజు సమీప కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగను పీల్చి రోగాల బారిన పడుతున్నారు.

గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త...

మంచిర్యాల పట్టణం నుంచి ప్రతిరోజు వెలువడే 40మెట్రిక్ టన్నులకు పైగా చెత్తను ప్రతీ రోజు పట్టణ శివారులోని అందాళమ్మ కాలనీలోని నగర పాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో డంపింగ్ చేస్తున్నారు. చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు గతంలో ఏర్పాట్లు చేసినా, ఆ తరువాత దానిని పట్టించుకోకపోవడంతో పేరుకుపోతున్న చెత్త తరుచూ కాలిపోతుంది. చెత్తతో వచ్చే దుర్వాసనతో పాటు, చెత్త కాలిపోవడం వల్ల వెలువడే పొగతో ఈ ప్రాంత కాలనీ ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఏ కాలంతో సంబంధం లేకుండా చిన్నారులు, వృద్ధులు, యువత అనే తేడా లేకుండా తరుచూ వ్యాధుల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల చెత్తను బయోమైనింగ్ చేసే ప్రక్రియను ప్రారంభించినా, గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో చేస్తున్న జాప్యంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బయోమైనింగ్ ప్రక్రియ వేగవంతం కాకపోవడం, పేరుకుపోతున్న చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు అంటిస్తుండడంతో తరుచూ పొగచూరుతోంది. డంపింగ్ యార్డును అందాళమ్మ కాలనీ నుంచి తొలగించాలని కాలనీవాసులు పలుమార్లు ఆందోళనలు చేశారు. శాశ్వతంగా డంపింగ్ యార్డును తరలించాలని, ఉన్న చెత్తను కాలకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడంతో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు, హాజీపూర్ మండలానికి చెందిన 8 గ్రామాలు ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం అయ్యాయి. అందాళమ్మ కాలనీలోనే చెత్తను వేస్తే, రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై మంచిర్యాల ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను వివరణ కోరగా డంపింగ్‌యార్డులోని చెత్తను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను అంటించడంతో, వచ్చిన మంటలను ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'కేంద్ర బడ్జెట్ పేదలకు అనువైంది కాదు'



నిరసన తెలుపుతున్న శ్రేణులు

తాండూర్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఏమాత్రం అనువైంది కాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారాం విమర్శించారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఆదివారం సీపీఎం, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు, అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు దోహదపడే అంశాలు బడ్జెట్‌లో ఏమీ లేవన్నారు. ప్రత్యేకించి కార్మిక వర్గానికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బడ్జెట్ కూర్పు, నిధుల కేటాయింపు సరిగ్గా లేదన్నారు. డీజీల్, పెట్రోల్‌పై విధించిన పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈజీఎస్ పథకానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిందని అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల శ్రేణులు నానయ్య, రాజయ్య, బాదిరావు, శ్యామ్‌రావు, జంగు, ప్రభాకర్, భోజీరావు, భీంరావు, గౌరుబాయి, సంతోషిబాయి, జంగుబాయి, లింగుబాయి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నీరు ఇలా.. వెళ్లేదెలా..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో బ్యాంకు పక్కన ఉన్న కాలనీలోకి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. మురికి కాలువలు సక్రమంగా పూడిక తీయకపోవడంతో నీరంతా నడిచే దారిలోనే నిలిచి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుకి నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : మోహన్, ప్రత్యేకాధికారి, ఆస్నాద

ఫోన్ నంబర్ : 94402 08443

ఆంక్షలు ఎత్తివేసేందుకు ఎమ్మెల్యే కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లోని పలు అటవీ చెక్‌పోస్టులలో చేపడుతున్న ఆంక్షలను ఎత్తివేసే దిశగా ఖానాపూర్ ఎమ్మెల్యే, వైల్డ్‌లైఫ్ బోర్డు డైరెక్టర్ వెడ్మ బొజ్జు పటేల్ కృషి చేస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో పగలు భారీ వాహనాల రాకపోకల పునరుద్ధరణ, రాత్రి అన్ని వాహనాల రాకపోకలు కొనసాగించేలా ఎమ్మెల్యే అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. రాత్రి 9గంటలకు స్థానికులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారని, ఈ విషయం అటవీశాఖ ఉన్నత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే స్థానికేతర వాహనాలు సైతం అనుమతి ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. రాకపోకల పునరుద్ధరణ త్వరలోనే జరుగుతుందని, ఈ విషయంలో మండలవాసులు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని సూచించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇసాక్, శంకరయ్య, ఇందయ్య, రమేశ్, సుధీర్‌కుమార్, శేషురావు, పంకజ, ముజ్జు, అజార్, మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ లావణ్య, నాయకులు వెంకటరాజం, శంకరన్న తదితరులు ఉన్నారు.

డప్పుల పంపిణీ



డప్పులతో దరువేస్తున్న నాయకులు

వేమనపల్లి: హైదరాబాద్‌లో జరగబోయే 'లక్ష డప్పులు – వేల గొంతులు' కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్ రూ.60వేల విలువ చేసే వంద డప్పులు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్ర సతీష్ మాదిగ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీలతో కలిసి దరువేస్తూ నీల్వాయిలో ఆదివారం భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో వేమనపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కుర్రు వెంకటేషం, ఒడిళ్ల రాజన్న, గాలి మధు, కొమురం రమేష్, పున్నం, జగన్, తోకల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'మందమర్రిని గ్రామ పంచాయతీ చేయాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ...

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీగా ఏర్పడి ముప్పై సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకూ ఎన్నికలు నిర్వహించలేదని, పాలకవర్గం లేక ఇబ్బంది పడుతున్నామని ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు వాపోయారు. వెంటనే మందమర్రిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ కూడలి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు పాలకవర్గం ద్వారా అభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రజల ప్రాతిపదికనా అభివృద్ధిని కాంక్షించి అప్పటి ప్రభుత్వం మున్సిపాలిటీ చేస్తే పాలకవర్గం ఎన్నికల నిర్వహన లేకపోవడంలో ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రి అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీని రద్దుచేసి గ్రామ పంచాయతీగా చేసినట్‌లెతై ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పడి అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. అంతకుముందు ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి సింగరేణి హైస్కూల్యెదుట గల అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు పెద్ది భార్గవ్, రాజన్న, రాజేష్, అరుణ్‌కుమార్, పృధ్విరాజ్, గంట సత్యం, సత్యనారాయణ, రాజేశ్వరి, లలిత తదితరులు ఉన్నారు.

వయో వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

నస్పూర్: వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్(టాస్కా) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పి. శంకర్‌గౌడ్ అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు, వయోధికుల పోషణ సంక్షేమ చట్టం రూల్స్ 20ని ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. సీనియర్ సిటిజెన్స్ కోసం ప్రతీ మండల, మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఉచిత వైద్యం అందించాలని, ఉచిత రైల్వే, బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని, మెయింటెనెన్స్, ట్రిబ్యునల్, అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ణీత సమయంలో తీర్పును వెలువరించి అమలు పరిచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2007చట్టం సెక్షన్ 21ప్రకారం వృద్ధులకు పోలీస్ శాఖ రక్షణ కల్పించాలన్నారు. అనంతరం టాస్క జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చిలువేరు సదానందంను నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకయ్య, నాయకులు సమ్మయ్య, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి అఖండ భజన



భజనలో పాల్గొన్న నిర్వాహకులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో శ్రీ భగవాన్ సత్యసాయి ఆధ్వర్యంలో వంద రోజుల అఖండ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం నిర్వాహకులు మంచాల శంకరయ్య తెలిపారు. ఈ అఖండ భజన కార్యక్రమంలో అన్నారం, రాజారం గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరంగల్ తరలిన బీసీ సంఘం నాయకులు



సభకు వెళ్తున్న బీసీ నాయకులు

జైపూర్/పాతమంచిర్యాల: స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా జనగణన చేపట్టాలని, ఈడబ్ల్యూ రిజర్వేషన్లు రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం వరంగల్‌లో బీసీ రాజకీయ యుద్ధ భేరి నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ సభకు జిల్లా కేంద్రం, జైపూర్ మండలం నుంచి బీసీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, గొల్లకురుమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాదబోయిన రాజన్న, జైపూర్ నుంచి బీసీ జేఏసీ నాయకులు గణేశ్, మల్లేశ్, నగేశ్, రాజేశ్, బాపు, పద్మశాలీ సంఘం, కుల సంఘాల నాయకులు తరలివెళ్లారు.

దొంగలు దొరికేనా?

- 14రోజుల క్రితం నాలుగు ఇళ్లలో చోరీ!

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట, మేదరిపేట, కొత్తమామిడిపల్లి, మామిడిపల్లి నాలుగు గ్రామాల్లో సుమారు 14రోజుల క్రితం దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం, వెండి ఎత్తుకెళ్లినట్లు సమాచారం. బాధితులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా దొంగల ఆచూకీ మాత్రం దొరకడం లేదు. రోజుల వ్యవధిలో నాలుగు గ్రామాల్లో దొంగతనాలు జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో కొంత భయాందోళన చెందుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలోనే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా దొంగలను పట్టుకునే పనిలో ఉన్నట్లు, త్వరలో పట్టుకుంటామని చెప్పారు.